సాక్షి విజయనగరం

శుక్రవారం। 10। ఫిబ్రవరి। 2023



ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ప్రభుత్వ నుంచి ఎలాంటి సేవలు పొందాలన్నా ప్రధానంగా ఉండాల్సింది ఆధార్ కార్డు. ప్రతీ పదేళ్లకు దీనిని అప్‌డేట్ చేయాల్సిందే. - 8లో



చెరువులో..దుర్'మార్గం'

జామి మాధవరాయి మెట్ట వద్ద ఉన్న కటకం చెరువులో అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్నారు. దీనిపై రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం..మనతో పాటు మన కుటుంబాలను రక్షించుకుందామంటూ జిల్లా పోలీస్ శాఖ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

3,300 మందికి హెపటైటిస్-బి వ్యాక్సిన్



ఘోషా ఆస్పత్రిలోని ఐసీటీసీ సెంటర్‌లో శాంపిల్స్ పరిశీలిస్తున్న కామేశ్వర ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: జిల్లా వ్యాప్తంగా 3,300 మందికి హెపటైటిస్‌- బి వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏపీడీ డాక్టర్ వై. కామేశ్వరప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంతో పాటు ఘోషా ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెపటైటిస్ వ్యాక్సినేషన్, హెచ్‌ఐవీపై జరుగుతున్న సర్వేను పరిశీలించడానికి జిల్లాకు వచ్చినట్లు చెప్పారు. హెపటైటిస్‌- బి వ్యాక్సిన్ మూడు డోసులు వేస్తారని, ప్రస్తుతం మొదటి డోసు వేస్తున్నట్లు తెలిపారు. వ్యాక్సిన్ వేసిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రామేశ్వరి ప్రభు, డీపీఎం బాలాజీ, సూపర్‌వైజర్ సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియాను తరిమికొట్టాలి

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: మల్టీడ్రగ్ మందులు వినియోగించి ఫైలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లా అంతటా డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతూ, మాత్రల పంపిణీపై పలు సూచనలు చేశారు. 9వ తేదీ రాత్రికి మెటీరియల్ అంతా ఏఎన్‌ఎంలకు చేరాలన్నారు. సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ గురుకుల వసతిగృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు భోజనం చేసిన తర్వాత మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా రోజుల్లో పాఠశాలలకు రాని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి మాత్రలు వేసుకునేలా చూడాలని సూచించారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి అన్ని పాఠశాలలకు వెంటనే సర్క్యులర్ జారీ చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతానికి నగరాల్లో మున్సిపల్ కమిషనర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. అలాగే డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ స్పందించి ఆస్పత్రుల్లో మాత్రలు వేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి రోజే 99 శాతం పూర్తి కావాలని.. మిగిలిన రెండు రోజులు మ్యాపింగ్ చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను జిల్లా పంచా యతీ అధికారి సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో అన్నిచోట్లా మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టాలన్నారు. రెండేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారు మాత్రలు వేసుకోరాదని సూచించారు. రెండు నుంచి ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులు ఒక డీఈసీ మాత్ర, 6 నుంచి 14 ఏళ్ల వారు రెండు డీఈసీ మాత్రలు, ఒక ఆల్బెండజోల్ మాత్ర, 15 సంవత్సరాలకు పైబడిన వారు మూడు డీఈసీ మాత్రలు, ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా మలేరియా నివారణాధికారి తులసి, జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సోషల్ వెల్ఫేర్ డీడీ రత్నం, డీఈఓ లింగేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

- జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎస్.కుమార్

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్‌దారులందరూ తప్పకుండా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని, ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానా అధికారి ఆర్ఎస్‌కుమార్ సూచించారు. హెర్బ్ యాప్ సాయంతో సంబంధిత పింఛన్‌దారుడు తన సీఎఫ్‌ఎంఎస్ ఐడీకి ఈకేవైసీ చేయించుకొని వివరాలను ఉపఖజానా అధికారికి ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో తన ఆధార్ నంబర్‌కు లింకైన మొబైల్ నంబర్లను మాత్రమే వినియోగించాలని, లేనిపక్షంలో ఆధార్‌కు మొబైల్ నంబర్లను లింకుచేయించుకోవాలని పేర్కొన్నారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా గానీ, హెచ్‌సీఎం పెన్షన్ లాగిన్ ద్వారా గానీ ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిపై
పిడుగు



అది రూ.కోట్ల విలువైన ప్రభుత్వభూమి. దానిపై 'పిడుగు' కన్నుపడింది. అధికారయంత్రాంగమంతా భోగాపురం నిర్వాసితుల తరలింపు పనిలో ఉన్నవేళ.. మెరుపు వేగంతో భూమిని ఆక్రమించేందుకు పూనుకున్నాడు. రాత్రికిరాత్రే భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేశాడు. ప్రశ్నించే అధికారులపై 'పిడుగు'వలే గర్జిస్తున్నాడు. పార్టీ అధినాయకుడి నుంచి కార్యకర్త వరకు అవినీతి, ఆక్రమణలు, దందాగిరి చేయడమే మా నైజమంటూ జులుం ప్రదర్శిస్తున్నాడు. ఆయన ఆక్రమణల పర్వం తెలుసుకోవాలంటే భోగాపురం మండలం ముంజేరు గ్రామానికి వెళ్లాల్సిందే.



ప్రభుత్వ భూమి చుట్టూ అక్రమంగా వేసిన ఫెన్సింగ్

- భోగాపురంలో దాదాపు రూ.9 కోట్ల విలువైన భూమిపై కన్ను
- స్థానిక టీడీపీ నాయకుడు పిడుగు నాగరాజు జులుం
- రాత్రికిరాత్రే ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్
- మైనింగ్ లీజుకు దరఖాస్తు ముసుగులో హస్తగతం



ఈ చిత్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు పక్కన ధీమాగా నిలబడిన వ్యక్తిపేరు పిడుగు నాగరాజు. అంతేకాదు భోగాపురంలోని టీడీపీ నాయకుల అండ కూడా మెండుగా ఉన్న వ్యక్తి ఆయన! ప్రశ్నిస్తే నోరేసుకొని పడిపోవడం, బెదిరించడం... ఇంకా బెదరకపోతే తిరిగి పోలీసు కేసులు పెట్టడం ఆయనకు నిత్యకృత్యం. ఇప్పటికే ఇలాంటి కేసులో బెయిల్‌పై బయట ఉన్నా అతని 'కబ్జా' కార్యకలాపాలు మాత్రం మానుకోవట్లేదు. టీడీపీ అధినాయకుడి నుంచి నియోజకవర్గ నాయకుల వరకూ అండగా ఉన్నప్పుడు కొడితే కుంభస్థలాన్నే కొట్టాలని ఓ ప్రభుత్వ భూమిపై కన్నేశాడు. ఇంకేముంది రాత్రికి రాత్రే దాదాపు రూ.9 కోట్ల విలువైన ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేశాడు ఈ పచ్చపార్టీ ఘనుడు!

సాక్షి ప్రతినిధి, విజయనగరం/భోగాపురం:

భోగాపురం మండలం ముంజేరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 286/5లో 3.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ముంజేరు నుంచి ముక్కాం బీచ్‌రోడ్డు వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి పరిసరాల్లో ఉన్న భూముల విలువ ఇప్పుడు ఎంతో పెరిగింది. ఈ దృష్ట్యానే కొంతమంది ప్రభుత్వ భూమిపై కన్నేశారు. ఏదో ఒక ముసుగులో భూమిని గుప్పిట పట్టేందుకు కుతంత్రాలు పన్నుతున్నారు. వాటిలో పిడుగు నాగరాజు వ్యవహారం ఓ ఉదాహరణ. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు విమానాశ్రయం నిర్వాసితులను నిర్వాసిత గ్రామాల నుంచి ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదునుగా నాగరాజు ముంజేరులో ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయించేశాడు.

చర్యలు తీసుకుంటాం...

ముంజేరులో ప్రభుత్వ భూమి ఆక్రమణ తమ దృష్టికి వచ్చింది. గతంలో రమణమ్మ అనే తహసీల్దార్ పనిచేసిన సమయంలో స్టాటిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన వ్యక్తులు 2022 మార్చి 14న ఆ భూమిలో మైనింగ్ కోసం దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తు మైనింగ్ శాఖకు వెళ్లింది. అక్కడి నుంచి ఇంకా అనుమతులు రాలేదు. అవేవీ లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– కోరాడ శ్రీనివాసరావు, భోగాపురం తహసీల్దార్

మైనింగ్ దరఖాస్తు ముసుగు...

ముంజేరులో కంకర తవ్వుకునేందుకు గతంలో ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన వ్యక్తులు రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి కోసం దరఖాస్తు చేశారు. అది ఇంకా పరిశీలన దశలోనే ఉంది. ఇంకా ఎలాంటి అనుమతులూ ఆ శాఖల నుంచి రాలేదు. అవి వచ్చేవరకూ ఆగితే వారు టీడీపీ నాయకులు ఎందుకు అవుతారు? తాము మైనింగ్ కోసం దరఖాస్తు చేశాం, అనుమతులు వచ్చేశాయన్న బిల్డప్ ఇస్తూ సర్వే నంబరు 286/5లో 3.20 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేశారు. దీనికి పిడుగు నాగరాజు బాధ్యుడని స్థానికులు చెబుతున్నారు.

రక్షణశాఖ భూములకు హద్దుల గుర్తింపు

బాడంగి: బాడంగి సమీపంలో రక్షణ శాఖకు చెందిన భూములకు హద్దులు నిర్ణయించాలని విశాఖ రక్షణశాఖకు చెందిన సహాయ డిఫెన్స్‌ఎస్టేట్ అధికారి గిరిబాబుతో పాటు ముగ్గురు అధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి భూములను గురువారం పరిశీలించారు. రక్షణశాఖ స్థలంలో నిర్మించిన కోళ్లఫారం షెడ్లు, ఇటుక తయారీ కూలీలు వేసుకున్న షెడ్లను తొలగించాలన్నారు. తాత్కాలికంగా రైతులు సాగుచేస్తున్న పంటలకు నష్టం వాటిల్లకుండా హద్దులు నిర్ణయించాలన్నారు.



రక్షణశాఖ భూముల హద్దులను పరిశీలిస్తున్న డిఫెన్స్ అధికారులు

కొత్త పనులకు శ్రీకారం

- కొత్తగా గుర్తించిన ఉపాధిహామీ పనులు ప్రారంభం
- పైలెట్ ప్రాజెక్టు కింద నందిగామలో పనులు
- హార్టికల్చర్‌లో రింగ్ ట్రెంచ్‌లు, బౌండరీ ట్రెంచ్, సెరికల్చర్ షెడ్డు వంటి పనులకు ప్రాధాన్యం



నందిగామలో ఫారంపాండ్ తవ్వుతున్న వేతనదారులు



బౌండరీ ట్రెంచ్‌లు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్టు కింద భోగాపురం మండలం నందిగామ గ్రామంలో పనులు ప్రారంభించారు. గతంలో చెరువుల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, చెరువులు, కాలువల గట్లు పటిష్టం చేయడం వంటి పనులు చేసేవారు. కొత్తగా ఉద్యానవన విభాగంలో తోటలకు ట్రెంచ్‌కటింగ్, రింగ్, బౌండరీ ట్రెంచ్‌లు, సెరీకల్చర్ షెడ్డుల నిర్మాణం, అమృత్ సరోవర్ కింద ఫారం పాండ్స్ అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. జిల్లాలో 3.45 లక్షల జాబ్ కార్డులు ఉండగా, 6 లక్షలమంది వేతనదారులు ఉన్నారని, పనికి వచ్చేవారందరికీ పనికల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి తెలిపారు.

హోరాహోరీగా...

- బాస్కెట్‌బాల్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు



పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండలంలోని తెన్నుబొడ్డవరలో డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్‌-17 బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎమ్మెల్సీ రఘురాజు పోటీలను ప్రారంభించారు. క్రీడలు మానసిక ఆరోగ్యానికి, మనోవికాసానికి, శారీరక సామర్థ్యానికి దోహదపడతాయన్నారు. చదువుతో పాటు ఆటల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షురాలు సుధారాజు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి.లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీరాములు, పీఈటీసీ ప్రిన్సిపాల్ డా.భార్గవ్‌రామ్, వరలక్ష్మి స్కూల్ ప్రిన్సిపాల్ కె.రమేష్ పాల్గొన్నారు. సుమారు 70 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు.

అదనపు సబార్డినేట్ కోర్టు మంజూరు

విజయనగరం లీగల్:

విజయనగరం జిల్లాకు అదనపు సబార్డినేట్ కోర్టు మంజూరైంది. తాడేపల్లిలో బుధవారం జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో ప్రభుత్వం ఈ మేరకు ప్రకటించింది. ఈ సందర్భంగా స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బండారు సంజీవరావు తన చాంబర్‌లో విలేకరులతో గురువారం మాట్లాడుతూ అదనపు సబార్డినేట్ కోర్టు మంజూరుకు కృషి చేసిన మంత్రి బొత్స సత్యనారాయణకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు మంత్రి బొత్స సానుకూలత తెలిపారన్నారు. వీలైనంత తొందరగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కోర్టు భవనానికి తగిన నిధుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం పొందేతెలిపేలా మంత్రి చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. అదనపు కోర్టు అవసరాన్ని మంత్రి బొత్స దృష్టికి తీసుకెళ్లిన సీనియర్ న్యాయవాదులు కండాపు ఫల్గుణరావు, కోలగట్ల తమ్మన్నశెట్టి, టి.వి.శ్రీనివాసరావును ఆయన అభినందించారు. సమావేశంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు వై.హరికృష్ణ, చుక్క భాస్కరరావు, యు.వి.రాజేష్, ధవళ శివరాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సంజీవరావు, పక్కన ప్రతినిధులు



మోగింది.. ఉత్తరాంధ్ర నగారా

- 16న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- ఈ నెల 9 నుంచి ఉత్తరాంధ్రలో అమల్లోకి ఎన్నికల కోడ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- ఉత్తరాంధ్రలో 2,82,348 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- 338 పోలింగ్ స్టేషన్లు, 694 బ్యాలెట్ బాక్సులు
- 6 జిల్లాల్లో 1,860 మంది పోలింగ్ అధికారులు

నోటిఫికేషన్ వివరాలివీ..

షెడ్యూల్ విడుదల: ఈనెల 16
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం : ఈనెల 16
నామినేషన్ల ముగింపు : ఈనెల 23
నామినేషన్ల పరిశీలన : ఈనెల 24
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ : ఈనెల 27
పోలింగ్ తేదీ : మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
కౌంటింగ్ తేదీ : మార్చి 16
ఎన్నికల ప్రక్రియ ముగిసే తేదీ : మార్చి 21

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నగారా మోగింది. శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ఎలక్షన్ కమిషన్ గురువారం విడుదల చేసింది. ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. మార్చి 13న ఎన్నికలు నిర్వహించి 16వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. షెడ్యూల్ విడుదలతో పట్టభద్రుల ఎన్నికల వేడి ఉత్తరాంధ్రలో రాజుకుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను ప్రకటించగా.. బీజేపీ, పీడీఎఫ్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. మరోవైపు టీడీపీ చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చడంతో నేతల్లోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 9 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ప్రకటించారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్, అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల డీఆర్‌వోలు వ్యవహరించనున్నారు. బ్యాలెట్ బాక్సులు ఎన్ని ఉన్నాయి.? పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, సున్నితమైన పోలీస్ స్టేషన్లు, ఓటరు జాబితాలు, పోలింగ్ స్టేషన్లలో సిబ్బంది, అధికారుల కేటాయింపు తదితర అంశాలపై తలమునకలవుతున్నారు. జిల్లాల కలెక్టర్లు ఆర్డీవోలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

అప్పుడు 1.70 లక్షలు.. ఇప్పుడు 2.82 లక్షల ఓటర్లు

2017లో జరిగిన ఎన్నికల్లో 1.70 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదవ్వగా 69.7 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఈసారి 2.82 లక్షలకు పైగా ఓటర్లు నమోదైన తరుణంలో పోలింగ్ శాతం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి 2017లో ఎన్నికైన పీవీఎన్ మాధవ్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

రాజుకున్న రాజకీయ వేడి

ఈసారి రాజకీయపక్షాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ముందుగానే ఎన్నికలపై దృష్టిసారించాయి. అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ని ప్రకటించగా.. ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్‌ఫ్రంట్(పీడీఎఫ్)అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభని ఎంపిక చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ మాత్రం చిన్నికుమారి లక్ష్మిని పక్కన పెట్టి డా. చిరంజీవిరావు తమ ఎమ్మెల్సీ అభ్యర్థి అంటూ తెరపైకి తీసుకొచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు వ్యవహార శైలి ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మింగుడుపడటం లేదు.

పోలింగ్ అధికారుల వివరాలు

జిల్లా	పీవో	ఏపీవో	ఓపీవో	రిజర్వ్	మొత్తం	మోనటరింగ్ అధికారి
విజయనగరం	70	70	210	35	385	70
పార్వతీపురం	24	24	72	12	132	24

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నిక అధికారిని ఎ.సూర్యకుమారి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో సుమారు 1,400 ఓటర్లు అటుఇటుగా ఉన్న చోట అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశంలో చర్చించి ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా మరికొన్ని పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పుపై కూడా సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు

జిల్లాల వారీగా ఓటర్లు	జిల్లాఓటర్లు	పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు
శ్రీకాకుళం	51,025	136
విజయనగరం	57,568	536
పార్వతీపురం మన్యం	18,307	188
అల్లూరి సీతారామరాజు	11,350	346
విశాఖపట్నం	1,03,243	2662
అనకాపల్లి	40,855	869
మొత్తం	2,82,348	4,737

పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	సహాయక స్టేషన్లు	మొత్తం పోలింగ్ స్టేషన్లు
విజయనగరం	64	06	70
పార్వతీపురం మన్యం	24	00	24

అవసరమైన బ్యాలెట్ బాక్సుల వివరాలు

జిల్లా	ఓట్ల బాక్సులు	రిజర్వ్	ఇతర బాక్సులు	మొత్తం బాక్సులు
విజయనగరం	116	23	00	139
పార్వతీపురం మన్యం	37	07	00	44

జేఎన్‌టీయూ జీవీ వీసీగా వెంకటసుబ్బయ్య



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం వర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆమోదంతో ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రాయూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్‌గా, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రాయూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్‌తో పాటు పీహెచ్‌డీ పూర్తిచేశారు. 1986లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన 2001లో అసోసియేట్ ప్రొఫెసర్, 2018లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఎదిగి ప్రస్తుతం శాఖాధిపతిగా కొనసాగుతున్నారు. బోధనారంగంలో ఆయన రాష్ట్ర, జాతీయ స్థాయిలో 11 అవార్డులు సాధించారు. పరిశోధనారంగంలో పలు అంశాలపై పుస్తకాలు రచించారు. యూనివర్సిటీ స్థాయిలో పలు కమిటీల్లో సభ్యుడిగా కొనసాగారు. ప్రవేశ పరీక్షల నిర్వహణకు సారథ్యం వహించిన అనుభవం ఉంది. కొత్తగా ఏర్పాటైన జేఎన్‌టీయూ జీవీ వర్సిటీకి తొలి వీసీగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర

గుమ్మలక్ష్మీపురం: మన్యంలో సీజన్ల వారీగా విరివిగా లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను మద్దతుధరకు కొనుగోలు చేస్తున్నట్టు గుమ్మలక్ష్మీపురం గిరిజన మార్కెటింగ్ సొసైటీ మేనేజర్ కృష్ణప్రసాదరావు తెలిపారు. తన కార్యాలయంలో విలేకర్లతో గురువారం మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎం సొసైటీ పరిధిలో రూ.38.50 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నది లక్ష్యంకాగా, ఇప్పటివరకు రూ.29 కోట్ల విలువైన ఉత్పత్తులు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం చింతపండు కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. సంతల్లో ఏర్పాటుచేసే జీసీసీ కాటాల వద్ద సరుకులు విక్రయించాలని గిరిజనులను కోరారు.

క్లుప్తంగా

నేడు కల్యాణమస్తు ఆర్థిక సాయం

● డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురం టౌన్: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమం ద్వారా నిరుపేద తల్లి దండ్రుల ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం శుక్రవారం జమ చేస్తుందని పార్వతీపురం మన్యం డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీడీఏ గిరి మిత్ర సమావేశం మందిరంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 67 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, భవననిర్మాణ కార్మికుల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.46.60 లక్షలు ఈ మేరకు జమ చేయనున్నట్లు తెలిపారు. నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందని తెలిపారు.

ఆటో, లారీ ఢీ: నలుగురికి గాయాలు



క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

కొత్తవలస రూరల్: విశాఖ–అరకు రహదారిలో అప్పన్నపాలెం జిందాల్ కర్మాగారం వద్ద గురువారం ఉదయం లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. డుంబిరిగూడ మండలానికి చెందిన గల్లోరి అర్జున్ కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో విశాఖపట్నం వెళ్తున్న సమయంలో జిందాల్ కార్మాగారం వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గల్లోరి నీలమ్మ, గల్లోరి రత్నప్రియ, దాసరి బాలన్నకు గాయాలు అవ్వడంతో 108లో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు.

క్షయ నివారణ శాఖ ఉద్యోగికి షోకాజ్

విజయనగరం ఫోర్ట్: జిల్లా క్షయ నివారణశాఖలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి డీటీసీఓ రామేశ్వరి ప్రభు గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. క్షయ నివారణశాఖలో నిధుల ఖర్చుకు సంబంధించి క్యాష్ బుక్ మెయింటైన్ చేయలేదని, గత ఏడాది నవంబర్‌లో క్షయ నివారణ శాఖలో టీబీ సీనియర్ సూపర్‌వైజర్, టీబీ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించి విద్యార్హత తప్పుగా ప్రకటన ఇచ్చారనే ఆరోపణలపై ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ విషయాన్ని క్షయ నివారణ అధికారి రామేశ్వరి ప్రభు ధ్రువీకరించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

● 10 రకాల సేవలకు అవకాశం
● సచివాలయాల్లో సేవలు



జూనియర్ కాలేజీలో ఆధార్ సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

విజయనగరం అర్బన్: ప్రభుత్వ నుంచి ఎలాంటి సేవలు పొందాలన్నా ప్రధానంగా ఉండాల్సింది ఆధార్ కార్డు. అందులో నమోదైన వ్యక్తిగత వివరాలన్నీ ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితుల వల్ల వాటి వినియోగంలో పారదర్శకత లోపిస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ కోసం చర్యలు చేపట్టింది, ప్రజలకు అందుబాటులో నిర్వహించాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియను సచివాలయాలలో ఏర్పాటు చేస్తోంది. అదేవిధంగా విద్యార్థులకు అందుబాటులో జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో నాలుగురోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది.

ఏడేళ్ల లోపు పిల్లలకు ఉచితం

ప్రతి పదేళ్లకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని నిర్దేశించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది ఆధార్ కార్డుదారులున్నట్లు అంచనా. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ పథకం ఆధార్‌తో అనుసంధానమైంది. అందువల్ల ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి. ఆధార్ కార్డుల్లో నమోదు చేసిన వివరాల్లో ఎటువంటి మార్పులు జరగకపోయినా పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తోంది. ఐదేళ్ల నుంచి ఏడేళ్ల మధ్య పిల్లలకు ఉచితంగా అప్‌డేట్ చేస్తారు. ఏడేళ్లు దాటిన వారి ఆధార్ బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ చేయడానికి రూ.100 రుసుం చెల్లించాలి. కేవలం డెమోగ్రాఫిక్ అప్‌డేట్ అయితే రూ.50, ఈ–ఆధార్ డౌన్‌లోడ్, ఎ4 షీట్‌పై కలర్ ప్రింట్ కోసం రూ.30 చెల్లించాలి. ఆధార్ అప్‌డేట్ ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ ద్వారా కూడా చేసుకోవచ్చు.

సచివాలయంలో అందించే ఆధార్ సేవలు

తాజాగా సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ సేవల్లో ప్రధానంగా 10 అంశాలున్నాయి. వాటిలో మొబైల్ నెంబర్ లింక్, ఆధార్‌కు ఈమెయిల్ ఐడీ లింక్, బయోమెట్రిక్ (ఫొటో, ఐరిష్, ఫింగర్ ప్రింట్) అప్‌డేట్, పేరు మార్పు (ప్రూఫ్ తప్పనిసరి), పుట్టిన తేదీ మార్పు (ప్రూఫ్ తప్పనిసరి), జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ (పీఓఐ అండ్ పీఓఏ ఒరిజినల్ తప్పనిసరి), చిరునామా మార్పు (ప్రూఫ్ తప్పనిసరి), కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ డౌన్‌లోడ్ ఉన్నాయి.

జిల్లా స్థాయిలో ఆధార్ మానిటరింగ్ కమిటీ

జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ (డీఎల్‌ఏఎంసీ) జిల్లాలో తొలిసారి ఏర్పాటైంది. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో 16 మంది వివిధ శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రతి మూడు నెలలకు జిల్లా స్థాయిలో కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఆధార్ నమోదు సేవల్లో ఎలాంటి అవకతవకలు వచ్చినా ఈ కమిటీకి ఫిర్యాదు చేస్తే పరిష్కార చర్యలను కమిటీ చేపడుతుంది.

48 సచివాలయాలల్లో ఆధార్ సేవలు

జిల్లాలోని 48 సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన ఆధార్ కిట్ల ద్వారా సేవలు అందిస్తున్నారు. మండలాల వారీగా వివరాలిలా ఉన్నాయి.

బాడంగి: బాడంగి–1, గజరాయనివలస.
భోగాపురం: సవరవిల్లి, ఎ.రావివలస.
బొబ్బిలి: పిరిడి, సీహెచ్ బొడ్డవలస.
బొండపల్లి: గొట్లాం, బొండపల్లి.
చీపురుపల్లి: మెట్టపల్లి.
దత్తిరాజేరు: దత్తిరాజేరు.
డెంకాడ: డెంకాడ.
గజపతినగరం: పురిటిపెంట–1.
గంట్యాడ: గంట్యాడ, లక్కిడాం.
గుర్ల: తెట్టంగి, గుర్ల.
జామి: అలమండ–1, భీమసింగి.
కొత్తవలస: కంటకాపల్లి, దేశపాత్రునిపాలెం.
ఎల్.కోట: చందులూరు, ఖాసాపేట, గొల్జాం.
మెంటాడ: మెంటాడ, జయితి.
నెల్లిమర్ల: సతివాడ, కొండవెలగాడ.
పూసపాటిరేగ: కుమిలి, పూసపాటిరేగ–1, గోవిందపురం,
ఆర్.ఆముదాలవలస: రేగిడి, సంకిలి.
రామభద్రపురం: బూశాయవలస, తారాపురం
సంతకవిటి: హొంజరాం, సిరిపురం
ఎస్.కోట: ఎస్.కోట–2, మూలబొడ్డవర,
వంగర: వంగర.
వేపాడ: కొప్పరవలస, వల్లంపూడి.
విజయనగరం: సారిక, గుంకలాం, గంజిపేట, కోరుకొండ.
విజయనగరం అర్బన్: బాలాజీనగర్ (ఎంఎస్ఎన్ కాలనీ), అరుంధతినగర్ (పాల్‌నగర్).

ఆధార్ సేవల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు



జిల్లావ్యాప్తంగా 125 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలను అందించడానికి అనుమతులు వచ్చాయి. తొలుత 48 సచివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేసి సేవలు అందిస్తున్నాం. ఆధార్ కార్డులో బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను ఉచితంగా అందజేయడంతో పాటు నిర్ణీత రుసుంతో అదనంగా మరో 10 రకాల ఆధార్ సేవలను పొందే అవకాశం ఉంది. ఆధార్ సేవల్లో అక్రమ వసూలు చేసినా, అలాగే ఇతర అంశాలలో ఎలాంటి ఫిర్యాదులున్నా జిల్లా మానిటరింగ్ కమిటీ ఫోన్ నంబర్ 9030546667కు తెలియజేయవచ్చు.

– కె.అశోక్, జిల్లా కో–ఆర్డినేటర్, గ్రామ, వార్డు సచివాలయాలు

సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

తెర్లాం: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లు విశేష ప్రతిభ కనబరిచాయి. ఆయా జట్లలో పాల్గొన్న క్రీడాకారుల్లో ఏడుగురిని జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన వారిలో బొబ్బిలి మండలం పారాది హైస్కూల్‌కు చెందిన జి.నానిబాబు, కె.రోహిత్, ఎస్.జయశ్రీ, తెర్లాం హైస్కూల్ నుంచి ఎం.శేఖర్, కె.ఉదయ్‌కిరణ్, ఇ.మీనా, ఉల్లిభద్ర హైస్కూల్‌కు చెందిన పి.హైమ ఉన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్.సత్యనారాయణ, జి.బంగారునాయుడు, శ్రీనివాసరావు అభినందించారు.

హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్–బి వ్యాక్సిన్



ఏఆర్‌టీ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు పథక సంచాలకుడు డాక్టర్ వై.కామేశ్వర ప్రసాద్

పార్వతీపురంటౌన్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులందరికీ హెపటైటిస్ – బి వ్యాక్సిన్ అందేలా చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు పథక సంచాలకుడు డాక్టర్ వై.కామేశ్వర ప్రసాద్ ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగుతున్న హెచ్‌ఐవీ సర్వే విధానాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ పి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా పార్వతీపురం జిల్లా అస్పత్రిలో గల హెచ్‌ఐవీ సర్వే సెంటర్‌ను తనిఖీ చేసి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నిర్వహిస్తున్న హెపటైటిస్–బి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి ఏఆర్‌టీ సెంటర్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది. జగన్నాథ రావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ శ్యామ్ కుమార్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, ఐసీటీసీ, ఏఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్విమ్మింగ్ పోటీలకు సిరిపురం విద్యార్థి



తేజేశ్వరరావును అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

సంతకవిటి: ఈనెల 11 నుంచి 13 వరకూ కృష్ణాజిల్లా కంకిపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు సంతకవిటి మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.తేజేశ్వరరావు ఎంపికయ్యాడు. అండర్–17 విభాగంలో జిల్లా తరపున ఈ విద్యార్థి పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.సన్నిబాబు తెలిపారు. గురువారం ఈ విద్యార్థిని పంచాయతీ సర్పంచ్ డోల తిరుపతి, పాఠశాల హెచ్‌ఎం వజ్జ వెంకటరావు, విద్యాకమిటీ చైర్మన్ రఘేంద్ర తదితరులు అభినందించారు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ దర్యాప్తు

రాజాం సిటీ: ఇటీవల మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన మెప్మా ఆర్పీ శారద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నమోదైన అట్రాసిటి కేసుపై డీఎస్పీ గురువారం దర్యాప్తు నిర్వహించారు. గ్రామానికి చెందిన శివజ్యోతి గ్రూపు సభ్యుల లోన్ మొత్తాన్ని ఆర్పీ శారద సొంతానికి వాడుకుంది. ఈ విషయమై గ్రూప్ సభ్యులు ఆరా తీసి మెప్మా సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్పీ ఆ నగదును బ్యాంకులో జమచేసినట్లు మెప్మా సిబ్బంది తెలిపారు. అయినప్పటికీ తనను మున్సిపాల్టీలో కొంతమంది మెప్మా సిబ్బంది కులం పేరుతో దూషించారని మనస్తాపం చెందిన శారద చీమలమందు తాగేసింది. ఈ విషయంపై సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో బాధితురాలిని, శివజ్యోతి సభ్యులను డీఎస్పీ మోహనరావు విచారణ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలు కొప్పెర్ల (బాలురు), నెల్లిమర్ల(బాలికలు),వంగర(బాలికలు)లో పార్ట్‌టైం ప్రాతిపదికన హెల్త్ సూపర్‌వైజర్/స్టాఫ్‌నర్స్‌గా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ జిల్లా సమన్వయకర్త బి చంద్రావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు అర్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, దరఖాస్తుతో పాటు ఆర్అండ్‌బీ సమీపంలో గల తమ కార్యాలయంలో ఈనెల 13లోగా అందజేయాలని పేర్కొన్నారు.ఇంటర్వ్యూ తేదీని దరఖాస్తులు సమర్పించిన ఫోన్‌నంబర్ ద్వారా నేరుగా అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు. కనీస విద్యార్హతలు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్‌గా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,900 గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు



సంఘటన స్థలంలో ప్రమాదానికి గురైన కార్లు

పాచిపెంట: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పాచిపెంట మండలంలోని పి.కొనవలస పంచాయతీ శ్యామలగౌరీపురం వద్ద గురువారం ఈ ఘటన జరిగింది. పాచిపెంటనుంచి సాలూరు వస్తున్న ఓ కారు, అదే సమయంలో సాలూరు నుంచి ఒడిశా వెళ్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి, ఈ ప్రమాదంలో సాలూరు పట్టణానికి చెందిన రాగల హరిబాబు, ఒడిశాకు చెందిన ముఖేష్ మంగి, గట్టి నవీన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

చెరువులో..దుర్మార్గం



కటకం చెరువు గర్భం ఆక్రమించి నిర్మించిన రహదారి

● ఫిర్యాదు చేసిన సాగు రైతులు
● పరిశీలించిన తహసీల్దార్
● 34 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ

జామి: మండలకేంద్రం జామి మాధవరాయి మెట్ట వద్ద ఉన్న కటకం చెరువులో అక్రమంగా రహదారి నిర్మాణం చేపడుతున్నారని స్థానిక రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. జిరాయితీ, చెరువు, ప్రభుత్వ స్థలంలో దౌర్జన్యంగా రహదారి నిర్మాణం చేపట్టారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తూ చెరువు ఆయకట్టు కింద సుమారు 80 ఎకరాలు సాగు చేస్తున్నామని రైతులు వాపోయారు. ఫిర్యాదు మేరకు మండల సర్వేయర్ ఖాదర్, వీఆర్వో శ్రీను ఆక్రమణకు గురైన స్థలాన్ని గురువారం సర్వే చేశారు. అనంతరం తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మాట్లాడుతూ మొత్తం 34 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించామని తెలిపారు. సర్వే నంబర్ 456లో 34 సెంట్లు, అదికాక ప్రైవేట్ స్థలం కొంత మేరలో రహదారి నిర్మాణం చేసినట్లు చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రహదారి నిర్మాణం చేపట్టడం చట్ట రీత్యా నేరమన్నారు. స్థలంలో ఉన్న జేసీబీని సీజ్ చేసి ఘటనా స్థలంలో పనులు నిర్వహిస్తున్న స్థానికులు ఇద్దరిపై కేసులు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్



సర్వే చేస్తున్న సర్వేయర్ ఖాదర్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం..మనతో పాటు మన కుటుంబాలను రక్షించుకుందామంటూ జిల్లా పోలీస్ శాఖ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ చేపట్టిన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన కూడళ్లు, జంక్షన్‌ల వద్ద ఈ మేరకు నిఘా పెంచింది. దొంగతనాలు, దోపిడీలతో పాటు రోడ్డు ప్రమాదాల బారి నుంచి వాహనచోదకులను కాపాడేందుకు కృషిచేస్తోంది. మద్యం మత్తులో వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేస్తోంది. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన వారిపైన కేసులు నమోదుచేసింది. గతేడాది సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన వారిపై 4,823 కేసులు, మైనర్ డ్రైవింగ్ కేసులు 1,223, ట్రిపుల్ రైడింగ్ 20, 272 కేసులు, మోటారు వాహనాల చట్టం అతిక్రమించిన 2 లక్షల 22 వేల 962 మందిపై కేసులు నమోదుచేసింది. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 5,500 మందిపై కేసులు నమోదుచేశారు. జిల్లా వ్యాప్తంగా 428 పైగా బ్లాక్ స్పాట్స్‌ను పోలీసులు గుర్తించి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పగటి వేళతో పాటు రాత్రివేళల్లో కూడా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటుచేసింది. ఫేస్‌వాష్ పేరుతో పలు స్టేషన్‌ల పరిధిలో ఉన్న హైవేలపై వచ్చే లారీలను నిలిపి డ్రైవర్లతో ముఖం కడిగించి వారి పరిస్థితి బాగుందన్న తర్వాతనే లారీలను పంపిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో కీలకమైన సెంటర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని అడ్డుకుని కేసులు నమోదుచేస్తున్నారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడితే నేరుగా జైలుకు పంపిస్తున్నారు.



రాత్రివేళ ప్రధాన కూడళ్లలో డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం మహమ్మారితో నష్టాలపై అవగాహన

ప్రతి పోలీసు అధికారి పగటి పూట ఆయా ప్రధాన జంక్షన్‌లలో మద్యం మహమ్మారి వల్ల వచ్చే నష్టాలను వివరిస్తూ, ఇంకెప్పుడూ మద్యం తాగి వాహనం నడపబోమని ఆటోడ్రైవర్లు, యువత, పెద్దలు వాహనచోదకులతో ప్రమాణాలు చేయిస్తున్నారు. వారితో ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను చదివించి, అనంతరం సంతకాలు సేకరిస్తున్నారు.



రోడ్డు భద్రత అవగాహనలో హెల్మెట్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతున్నాయి



మద్యం తాగి వాహనాలు నడిపే వారి వల్ల ఆ వ్యక్తులతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలకు సంబంధించిన వారి కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నమైపోతున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24కి. 10గ్రా.)	54,930–00
బంగారం(22కి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc. NIT No.579/27/E/TO/2022-23, Dt:09-02-2023

Roads & Drains under BPS Grant, Extension of Bund, Polycarbonate Roofing & Community hall etc.

Approx. No. of Works & Est.cost	11 Works, Rs.356.28 Lakhs
Download start date & time	14-02-2023,3:30 PM
Download end date &time	01-03-2023, 3.30 PM
Bid Submission Closing Date & Time	01-03-2023,4:00 PM
Bid opening Date & Time	01-03-2023, 4:30 PM

Contact Nos. 9849906481, 9849908296
Further details can be seen at www.apeprocurement.gov.in.
Sd/- Commissioner

WANTED
బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్లు కావలెను
ఆంధ్రప్రదేశ్‌లో క్వాజీ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామి సంస్థ
డిగ్రీ చదివి,కంప్యూటర్ పరిజ్ఞానం, స్వంత టూవీలర్ కలిగి, సంబంధిత మండల హెడ్ క్వార్టర్ చుట్టు ప్రక్కల గ్రామాలలో బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేయిస్తూ, బ్యాంకు యొక్క వ్యాపారాభివృద్ధి చేయగలగాలి.
11-Feb-2023 (Saturday)
ఉదయం : 10:00 గంటల నుంచి జరిగే వాకిన్ ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.
Amaravathi Fin Suraksha Nidhi Ltd (Quasi Bank)
Shop No.4&5, first Flor, Vytla Avenue, Mayuri Junction, Near APSRTC Complex, Vizianagaram -535002
Website: www.amaravathinidhi.in, Ph:93929 15966 & 91215 01124

సాక్షి
WALK IN INTERVIEW
సాక్షి దినపత్రికకు విజయనగరం టౌన్, ఎస్.కోట, రాజాం, సాలూరు, పాతపట్నం ప్రాంతాలలో ప్రకటనలు సేకరించుటకు స్టాఫ్ కావలెను
రిప్రజెంటేటివ్స్ / ఆఫీసర్స్
విద్యార్హత : డిగ్రీ, వయస్సు : 19–35 సం॥లు
అనుభవం : ప్రకటనల సేకరణలో లేదా ఏదైనా సేల్స్ మార్కెటింగ్‌లో అనుభవంగల వారికి ప్రాధాన్యత
జీతం : ఆకర్షణీయమైన జీతం + అలవెన్సులు ఇవ్వబడును
ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు మరియు 2లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫొటోలతో సహా తేది.10-02-2023 శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి ఇంటర్వ్యూలకు హాజరు కాగలరు.
ఇంటర్వ్యూకు హాజరు కాలేని వారు తమ బయోడేటాను sklmbm@sakshi.com కు మెయిల్ చేయగలరు.
SAKSHI
సాక్షి తెలుగు దినపత్రిక
సర్వే నెం. 125/సి, ఎన్‌హెచ్-16 రోడ్, ఎచ్చెర్ల గ్రామం, మండలం, శ్రీకాకుళం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ONE SITTING : 10th, 12th B.A; B.Com, B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA., BCA., MBA, MCA., Nursing. Pharmacy, LLB, B.Tech., M.Tech., from Recg., University in India (for Discontinued/Backlog Students) Exam in March / April. Contact : 73383 76874 [R-921]

COACHING CENTER
■ New Batches for all Competitive Exams @ 9 to 12 pm & 5 to 8 pm & Special EAMCET batch @ 2 to 5 pm on : 13-02-2023. Surya Academy, Kota Jn., VZM. Ph : 99490 03295 [V-6063]

SERVICES
■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1749]

ఆయుర్వేదం
■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-971]

WANTED
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779893]

■ నిరుద్యోగులకు సువర్ణ అవకాశం: ప్రముఖ IRPM కంపెనీ 26 సం॥ పూర్తి చేసుకున్న సందర్భంగా SKLM, VZMలో Q: 10th, Inter చదివిన 28 సం॥లోపు 50 మంది స్త్రీ/పు॥లకు ధరఖాస్తు. సెల్: 9849553548. [WA-2251]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr. Q.5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, ఫో+రూ ఫ్రీ, Hyd, 7993583999 [HA-965]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ J Group కంపెనీ హైదరాబాద్‌లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. Age: 18 to 30, సాలరీ: 14,000/- to 40,000/-+ కమీషన్. Qualification: 10th, Inter, Degree. ఫోన్: 9666688883. [HA-741]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.